ఈనాడు
చిత్తూరు
శుక్రవారం 21 ఆగస్టు 2015 20 పేజీలు




భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ(అగ్రశ్రీ) ఆధ్వర్యంలో జరిగిన 'గ్రామీణ భారతంలో పారిశుద్ధ్యం-స్వచ్ఛభారత్ నిర్వహణకు ప్రణాళిక అన్న అంశంపై నోబుల్‌శాంతి బహుమతి గ్రహీత రాజేంద్ర కె.పచౌరి మాట్లాడారు. అనంతరం ఫౌండేషన్ సావనీర్‌ను ఆవిష్కరించారు. వివరాలు 7లో

# పరివర్తన ద్వారానే పారిశుద్ధ్య సమస్యలు పరిష్కారం

## నోబుల్‌శాంతి బహుమతి గ్రహీత రాజేంద్ర కె.పచౌరి

**తిరుపతి (ఎస్‌బీఐకాలనీ), న్యూస్‌టుడే :** ప్రపంచ మానవాళికి పెనుసవాలుగా మారి వాతావరణ కాలుష్యానికి దారి తీస్తున్న పారిశుద్ధ్య సమస్యల పరిష్కారం మనిషిలో పరివర్తన ద్వారానే సాధ్యమవుతుందని ప్రపంచ ప్రఖ్యాత వాతావరణ శాస్త్రవేత్త, నోబుల్ శాంతి బహుమతి గ్రహీత డాక్టర్ రాజేంద్ర కె.పచౌరి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రైవేటు హోటల్‌లో భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ(అగ్రశ్రీ) ఆధ్వర్యంలో జరిగిన 'గ్రామీణ భారతంలో పారిశుద్ధ్యం-స్వచ్ఛభారత్ నిర్వహణకు ప్రణాళిక అనే అంశంపై జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నోబుల్ శాంతి బహుమతి గ్రహీత మాట్లాడుతూ.. పరిశుభ్రమైన వాతావరణం కోసం పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతం చేయడంతో పాటు ప్రజల్లో వాటి నిర్వహణపై స్వతహాగా మార్పు రావాలన్నారు. ప్రజాసేవల కార్యక్రమాన్ని మరింతంగా ప్రక్షాళన చేయాలని సూచించారు. అనంతరం భారత సామాజిక శాస్త్రాల పరిశోధన మండలి విశ్రాంత అధ్యక్షులు ఆచార్య వి.ఆర్.పంచముఖి మాట్లాడుతూ.. ఆసియా ఖండంలో భారతదేశాన్ని బలీయమైన దేశంగా తీర్చిదిద్దడంలో దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథి చేతుల మీదుగా కృష్ణా జిల్లా ప్రజా పరిషత్తు అధ్యక్షురాలు గద్దె అనురాధకు, కేరళ, నాదపురం గ్రామపంచాయతీ అధ్యక్షులు సూపి నారకట్టేలు, పులిమంతోల్ గ్రామం పంచాయతీ అధ్యక్షురాలు ఎం.కె.రఫీకా, తమిళనాడు వేలూరుకు చెందిన అడాసియస్ డ్రీమ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు దినేష్ గజేంద్రన్‌లకు భారతరత్న రాజీవ్‌గాంధీ జాతీయ పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో అపార్డ్ మాజీ కమిషనర్ డాక్టర్ కె.చంద్రమౌళి, ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య పి.వి.అరుణాచలం, అగ్రశ్రీ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ డి.సుందర్‌రామ్, శ్రీమతి భారతీ సుందర్‌రామ్, వివిధ పంచాయతీరాజ్ ప్రతినిధులు, సులభ్ ఇంటర్నేషనల్ నిపుణులు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.